## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట్, కుందన్‌బాగ్, గ్రీన్ ల్యాండ్స్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీకేరోడ్డు, రోశయ్య నివాస లేన్, శివబాగ్, శాంతిబాగ్, కేకేజోన్ హోటల్, శీష్మ హల్ థియేటర్ ఏరియా, జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్, దివ్యశక్తి లేన్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజ్ మెయిన్ రోడ్డు, అమృత విల్లా, సీఎం ఓల్డ్ క్యాంప్ ఆఫీసు, సీఎం బిల్డింగ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐఏఎస్, ఐపీఎస్, మినిస్టర్ క్వార్టర్స్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సనత్‌నగర్ సౌభాగ్యనగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

**ప్యారడైజ్ డివిజన్ పరిధిలో..**

సీతాఫల్‌మండీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామాలగుండు రామాలయం, హనుమాన్ టెంపుల్, నెహ్రూ హైస్కూల్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతాఫల్‌మండీ, మైలార్ గడ, గరోండా రోడ్డునంబర్–1 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### రోడ్లపై గుంతల పూడ్చివేత


శాంతినగర్‌లో రోడ్డుపై గుంతలు పూడ్చివేస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాకలోని పలు బస్తీల్లో అంతర్గత రోడ్లపై గుంతలను జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం పూడ్చివేశారు. స్థానిక సోషల్ యాక్టివిస్టు పాల్కంపల్లి మధుబాబు ఈ సమస్యను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన అధికారులు మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బందితో శాంతినగర్, లాలాపేట తదితర ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి రాకపోకలకు ఇబ్బందిల్లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో సోషల్ యాక్టివిస్టు మధు, స్థానికులు నర్సింగరావు, శ్రీనివాస్, చిన్నా తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### ఫైలేరియా సర్వేను వినియోగించుకోవాలి


సర్వే సిబ్బందితో సమావేశమైన కార్పొరేటర్

చిలకలగూడ : ఫైలేరియా సర్వేను ప్రజలు వినియోగించుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. కుట్టివెల్లోడి ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన వైద్యసిబ్బంది, ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఫైలేరియా కారక పరాన్నజీవి రాత్రి సమయంలో మానవ రక్తంలో చురుగ్గా సంచరిస్తుందని, అందుకే రాత్రి సమయాల్లో సర్వే, నమూనాల సేకరిస్తారన్నారు. మేడిబావి ఆర్య సమాజ ప్రాంగణంలో ఈనెల 9,10 తేదీల్లో రాత్రి 8 నుంచి 12 గంటల వరకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కుట్టివెల్లోడి మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, బీఆర్ఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### బాలుడిని మోసం చేసిన యువకుడిపై కేసు

చిలకలగూడ : బాలుడిని మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన మంజుల ప్రైవేట్ ఉపాధ్యాయురాలు. ఆమె కుమారుడు వినోద్ (15) అదే ప్రాంతానికి చెందిన శ్రీహరి (25) స్నేహితులు. దసరా పండగ సందర్భంగా దుర్గామాత మండపం పెట్టేందుకు డబ్బులు కావాలని శ్రీహరి కోరగా, వినోద్ తన ఇంట్లో బీరువాలోని తులం బంగారం, 12 తులాల వెండి పట్టీలను తీసుకువచ్చి శ్రీహరికి ఇచ్చాడు. కొన్ని రోజుల తర్వాత మంజుల బీరువా తెరిచి చూడగా బంగారు, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో కుమారుడిని నిలదీయగా జరిగిన విషయం వివరించాడు. వస్తువులు ఇవ్వాలని కోరగా తనవద్ద లేవని దురుసుగా ప్రవర్తించాడు. బాధితురాలు మంజుల ఫిర్యాదు మేరకు శ్రీహరిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆర్‌యూబీలకు మోక్షమెప్పుడో..?

**సికింద్రాబాద్‌లో రెండుచోట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు**

- ఐదేళ్ల క్రితమే రూ. 50 కోట్ల నిధులు మంజూరు
- నేటికీ ముందుకు సాగని కార్యాచరణ
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టని సంబంధిత శాఖల అధికారులు


చిలకలగూడ కూడలికి వెళ్లేమార్గం.. దీని పక్కనే మరో వంతెనకు ప్రతిపాదన

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో నిర్మించనున్న రెండు రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ల పనులు ప్రతిపాదనల్లోనే మూలుగుతున్నాయి. జీహెచ్ఎంసీ, రైల్వే సంయుక్తాధ్వర్యంలో రోడ్ అండర్ బ్రిడ్జిలు నిర్మించి రాకపోకలు సుగమం చేసేందుకు ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. కొద్ది నెలల్లోనే పనులు ప్రారంభిస్తామని అప్పటి అధికారులు, పాలకులు ప్రకటించారు. ఏడాదిలో మెట్టుగూడ–చిలకలగూడ చౌరస్తా, మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండి రైల్వే ట్రాక్‌ల వద్ద ఆర్‌యూబీలు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ తర్వాత పలు సాంకేతిక కారణాలు చూపుతూ.. పనులను అటకెక్కించారు.

**పుష్ బాక్సులు అమర్చడం ద్వారా..**

సికింద్రాబాద్ ప్రాంతమంతా రైల్వేస్టేషన్లు, ట్రాక్ లైన్లతో ఆవరించి ఉండడంతో ఇక్కడ ఆర్‌యూబీల నిర్మాణం అనివార్యంగా మారింది. ఇప్పటికే పలు వంతెనలు నిర్మించారు. ఒలిఫెంటా, తుకారాంగేట్, అలుగడ్డబావి ప్రాంతాల మాదిరిగా తొలుత పుష్ బాక్సులకు బయటే నిర్మించి రైల్వే ట్రాక్ కింద అమర్చే పద్ధతుల్లో కొత్త వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్‌బాక్సుల పద్ధతిలో వంతెనలు నిర్మిస్తే రహదారిపై వాహనాలు, ట్రాక్ మీదుగా రైళ్ల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు చర్యల కోసం కూడా రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు అధ్యాయనం చేశారు.

**ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు..**

తొలుత మెట్టుగూడ–చిలకలగూడ ఆర్‌యూబీ పనులు ప్రారంభించిన అనంతరం మాణికేశ్వరీనగర్ వంతెన పనులు చేపట్టాలని పలుమార్లు ఇరు విభాగాల అధికారులు సమావేశాలు నిర్వహించారు. మెట్టుగూడ–చిలకలగూడ చౌరస్తా మార్గంలో ప్రస్తుతం ఒకే వంతెన మీదుగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడ ఆర్‌యూబీ పూర్తయితే ఇది నాలుగు లేన్ల రహదారిగా మారనున్నది. తద్వారా సికింద్రాబాద్ నుంచి మెట్టుగూడ, తార్నాక మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పే అవకాశం ఉంటుంది. అలాగే సీతాఫల్‌మండి–మాణికేశ్వరీనగర్ ప్రాంతాలు జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా ఉన్నాయి. ఇరు ప్రాంతాల ప్రజలు ప్రస్తుతం ట్రాక్ దాటుకుని వెళ్లేందుకు ఐదు కిలోమీటర్లు తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇక్కడి ఆర్‌యూబీ పనులు పూర్తయితే 100 మీటర్లలోపు ప్రయాణంలోనే రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది.

| ప్రతిపాదిత వంతెన | మంజూరైన నిధులు (కోట్లలో) |
|---|---|
| మెట్టుగూడ–చిలకలగూడ | రూ.30 |
| మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండి | రూ.20 |

**పాలకులు చొరవ చూపాలి..**

రెండు వంతెనల నిర్మాణానికి పాలకులు చొరవ తీసుకోవాలని సికింద్రాబాద్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో రైల్వే, జీహెచ్ఎంసీ వేర్వేరుగా చేపడుతున్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తవుతున్నాయి. కానీ ఇరు విభాగాల అధికారులు సంయుక్తంగా చేపట్టాల్సిన పనుల విషయంలో మాత్రం తీవ్రంగా జాప్యం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ప్రతిపాదిక మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండి ఆర్‌యూబీ నిర్మించే ప్రాంతం

## పనుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

అమీర్‌పేట: అభివృద్ధి పనుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న మల్టీ లెవల్ పార్కింగ్ భవనాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతర ఎమ్మెల్యే మాట్లాడుతూ మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తయ్యేలా త్వరలోనే సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నదని అయితే వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో మల్టీ లెవల్ పార్కింగ్ భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్ ఆపై మరో మూడు అంతస్తుల భవనం పనులు ప్రారంభించామన్నారు. సెల్లార్‌లో కారు పార్కింగ్, టూ వీలర్, మొదటి అంతస్తులో కారు పార్కింగ్, రెండో ఫ్లోర్‌లో 2 రూమ్స్, 2 డార్మిట్‌లు, థర్డ్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, కిచెన్, డైనింగ్ హాల్ ఉండేలా డిజైన్ చేసినట్లు వివరించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం, ప్రభుత్వం మారడం వంటి కారణాలతో నిధులు విడుదల కాక పనులు నిలిచిపోయాయని చెప్పారు. ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో సైతం మల్టీ లెవల్ పార్కింగ్ భవన పనులకు శ్రీకారం చుట్టగా, అక్కడ కూడా నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని గుర్తు చేశారు. పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే సీఎంను కలుస్తామని తెలిపారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈఓ కృష్ణ, వివిధ శాఖల అధికారులు వెంకటేశ్వర్లు, వాసుదేవరెడ్డి, శర్మ, విశాల్, బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రావు, సంతోష్, కట్ట బల్‌రాం, కరుణాకర్‌రెడ్డి, పీయూష్ గుప్తా, కూతురు నర్సింహ, వనం శ్రీనివాస్, షాబాద్ శ్రీనివాస్‌రావు, హరిసింగ్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహాలు స్వాధీనం



చిలకలగూడ : గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఘటనలు చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. హెడ్‌కానిస్టేబుల్ రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద సోమవారం మధ్యాహ్నం పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా బస్టాప్ సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత కుటుంబసభ్యులు, బంధువులు ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

**గాంధీ ఆస్పత్రిలో..**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మరొక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. గాంధీ వెయిటింగ్ హాల్ వద్ద (65) ఏళ్ల వృద్ధుడు పడిఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని వృద్ధుడిని అత్యవసర విభాగానికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎరుకల నరేందర్ హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి



పద్మారావునగర్: సికింద్రాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన ఎరుకల నరేందర్ హత్యపై సమగ్ర విచారణ చేపట్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పులి కల్పన తదితరులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. గతేడాది సెప్టెంబర్‌లో గాంధీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని బోయిగూడ కల్లుకంపౌండ్‌లో హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. నరేందర్ హత్యపై నగర పోలీసు కమిషనర్‌కు లేఖ రాస్తానని చైర్మన్ బక్కి వెంకటయ్య హామీ ఇచ్చారని కల్పన చెప్పారు. బాధితులు విజయలక్ష్మి, శారద పాల్గొన్నారు.

### ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుల మెరుపు ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం మెరుపు ధర్నా చేపట్టారు. సాయంత్రం విధులు ముగించుకుని ఓయూ పాలన భవనానికి చేరుకొని ప్రవేశ ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. బేసిక్, డీఏ,హెచ్ఆర్ఏ 3 శాతం వార్షిక వేతన పెంపుతో కూడిన పే స్కేల్ అమలు చేయాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించక పోతే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

### రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఒకరు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సదరు వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 70 ఏళ్లు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712658581 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

### తాగునీటి లోప్రెషర్ సమస్యను తీర్చండి

సనత్‌నగర్: బేగంపేట బ్రాహ్మణవాడీ లేన్‌నంబర్–4లో తాగునీరు లో ప్రెషర్‌తో సరఫరా అవుతుండడంతో సరిపడా నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. తమ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న మర్రి శశిధర్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో అనువాదంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఓయూ హిందీ విభాగం హెడ్ ప్రొ.మాయదేవి మంగళవారం తెలిపారు. ×అనువాదం, మారుతున్న దృక్పథాలు, అభివృద్ధి చెందుతున్న అవకాశాలు× అనే అంశంపై వివేకానంద, సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీల హిందీ విభాగాలు భారత ప్రభుత్వ సెంట్రల్ హిందీ డైరెక్టరేట్, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సదస్సు జరగనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

### ఓయూలో ఓబీసీ విద్యార్థి సంఘం స్థాపన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ)ను స్థాపించారు. ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనేక అంశాలను చర్చించి నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా బొడిగె మహేశ్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సింధు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ యాదవ్, కార్యదర్శిగా రాకేశ్‌యాదవ్, జాయింట్ సెక్రెటరీగా కల్యాణ్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా వినయ్ గౌడ్‌ను ప్రకటించారు. ఓబీసీ విద్యార్థుల సమస్యల పై పోరాడనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## రూ. 10 కోట్లతో నాలా విస్తరణకు ఆమోదం

**సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్**


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో రూ. 10 కోట్ల వ్యయంతో నాలా విస్తరణకు ఆమోదం లభించిందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తెలిపారు. స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఇందిరానగర్‌కాలనీ, మహ్మద్‌గూడల్లో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహ్మద్‌గూడ వద్ద సివరేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే సహాయ సహకారాలతో సీతాఫల్‌మండిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. మహ్మద్‌గూడలో రూ.8 లక్షల వ్యయంతో సివరేజీ పైప్‌లైన్, ఇందిరానగర్‌కాలనీలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు.

**దవాఖానా పనులు పరిశీలన..**

రూ. 12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కుట్టివెల్లోడి ఆస్పత్రి భవన సముదాయాల పనులను కార్పొరేటర్ హేమ, సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే పద్మారావు మంగళవారం పరిశీలించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి ప్రత్యేక అనుమతులు సాధించామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు విద్యాసాగర్, నవ్య, స్వర్ణలత, కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, రాజసుందరం, సుమిత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన


ప్రయాణికులకు రైల్వే భద్రత గురించి వివరిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

సికింద్రాబాద్: రైల్వే ప్రయాణికుల భద్రతపై రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) పోలీసులు సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే భద్రతా చర్యలకు అనుగుణంగా ఉంటామని ప్రయాణికులు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల ప్రజలతో డిప్యూటీ మేయర్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు వినియోగించుకోవాలని, లెవల్ క్రాసింగ్‌ల వద్ద పట్టాలు దాటవద్దని, నడుస్తున్న రైళ్ల నుంచి ఎక్కడం, దిగడం వంటి నేరాలు, ప్రమాదాలను వివరించారు. రైళ్లలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన సందర్భాలు, నేరాలు, ప్రమాదాల సమాచారాన్ని వినియోగించుకోవడం కోసం దయల్ 139 నంబర్‌కు కాల్ చేయడం ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించే పద్ధతులపై ఆర్‌పీఎఫ్ అధికారులు ప్రయాణికులకు అవగాహన కలిగించారు. ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎం.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


బోయిగూడ గ్రంథాలయాన్ని సందర్శిస్తున్న చైర్మన్ ఉపేందర్ రెడ్డి

బన్సీలాల్‌పేట్: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కే ఉపేందర్ రెడ్డి అన్నారు. నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజతో కలిసి బోయిగూడ గ్రంథాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నగరంలో 12 నూతన గ్రంథాలయాలు నిర్మిస్తుండగా మరో 33 లైబ్రరీలకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. బోయిగూడ గ్రంథాలయ నూతన భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బోయిగూడ గ్రంథపాలకురాలు బి. షాలినీ, పాఠకులు ఎం. శ్రీనివాస్, ఫాటోరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు చైర్మన్ ఆదయ్యనగర్, కవాడిగూడ తదితర గ్రంథాలయాలను సందర్శించారు.

## మైనర్లతో పనులు చేయిస్తే చర్యలు


మాట్లాడుతున్న మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్

అడ్డగుట్ట: మైనర్లను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్ హెచ్చరించారు. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్‌లో బాలల హక్కులు–పాఠశాలల స్థితిగతులపై వివిధ ప్రభుత్వ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బడి బయటి పిల్లలందరినీ గుర్తించి స్కూళ్లలో చేర్పించాలన్నారు. సీడీపీఓ స్వప్న మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులను మెరుగుపరిచి పిల్లలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూస్తామన్నారు. మోండామార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ.. బాలల హక్కులకు సంబంధించి చర్చించిన విషయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎంవీ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. పిల్లల బంగారు భవిష్యత్తుకు తాము ప్రవేశపెట్టిన మూడు తీర్మానాలు అంగీకరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మూడు నెలలకోసారి తహసీల్దార్ ఆధ్వర్యంలో అన్ని డిపార్ట్‌మెంట్లలో పిల్లలపై సమావేశం నిర్వహించాలన్నారు. మారేడుపల్లిని బాల కార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సంఘటితంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా మద్యం, మాదవ ద్రవ్యాల నుంచి పిల్లల్ని కాపాడేలా తగు చర్యలు చేపట్టాలని విన్నవించారు. సమావేశంలో తుకారాంగేట్ ఎస్ఐ దయాకర్, శ్రీనివాస్, భరద్వాజ్, భాగ్యలక్ష్మి, సుబ్బారావు, ఏపీఎం. స్వామి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, రమాదేవి, అజయ్, శోభ, జమున, సంధ్య, కాంపల్లి శ్రీనివాస్, వీరయ్య, గోపి, శాంతి, లక్ష్మి పాల్గొన్నారు.

### గొల్లగట్టును రాష్ట్ర పండుగగా గుర్తించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గొల్లగట్టును రాష్ట్ర పండుగగా గుర్తించాలని యాదవ విద్యార్థి నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. ఓయూలో గొల్లగట్టు సాంస్కృతిక చరిత్ర అనే అంశంపై ఈ నెల 11న జరిగే సదస్సు పోస్టర్‌ను ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు. గొల్లగట్టును రాష్ట్ర పండుగగా గుర్తించి, అధిక నిధులు, పూర్తి స్థాయి చైర్మన్, కమిటీ సభ్యులను నియమించాలని, ఏడాది పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ యాదవ్, జానయ్యయాదవ్, రామరాజుయాదవ్, రమేశ్‌యాదవ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కేలండర్ల ఆవిష్కరణ

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను రజక వృత్తిదారుల సంఘం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చారకొండ వెంకటస్వామి, కార్యదర్శి గోపాల్, యాదమ్మ, భాస్కరరావు, ప్రభాకర్, కేశవులు, బాబు, నగేశ్, రాజు, పెద్దపురం భాస్కర్ పాల్గొన్నారు.

**యూనియన్ బ్యాంక్ దివ్యాంగ ఉద్యోగుల కేలండర్**

సనత్‌నగర్: యూనియన్ బ్యాంక్ దివ్యాంగ ఉద్యోగుల కేలండర్‌ను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైకల్యాలు గల వ్యక్తులు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఇతర వైకల్యాలు గల వ్యక్తుల హక్కులు, వారిని చైతన్యం చేసేందుకు ముందుకురావడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి రాజశేఖర్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.స్వామి నాయక్, నాయకులు హరిలాల్ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కేలండర్..**

లాలాపేట: సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం కేలండర్‌ను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు జి. రమేశ్, శివరాత్రి శ్రీనివాస్, సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గండికోట ఆనంద్‌కుమార్, జనరల్ సెక్రటరీ దుర్గా వెంకటేశ్, కోశాధికారి గండికోట నర్సింహ, ఉపాధ్యక్షులు ముదావత్ రాజు, కుంచపు వెంకన్న, ఏ.శేఖర్, క్రాంతి, సుధాకర్, ఈరయ్య, చేవెళ్ల రమేశ్ తదితరులు ఉన్నారు.